# మన(సు)లో మాట

పాఠకులందరికి విజయదశమి శుభాకాంక్షలు. గత సంచికలలోని పలు శీర్షికల గురించి మాకు అందిన లేఖలకు ధన్యవాదములు. గత సంచికలోని 'ముఖచిత్రము గురించి మూడు ముక్కలు' మీలో పలువురికి నచ్చినందుకు సంతోషం.

ఈ సంవత్సరము సంఘమిత్ర నిర్వహించిన 'శ్రీనివాస రామానుజన్ మేథమేటిక్స్ క్లబ్ 2007', 'మేధావధానము 2007' విజయవంతముగా సాగి, పలువురి ప్రశంసలకు పాత్రమైనందుకు మాకెంతో ఉత్సాహం కలిగింది. ఈ సంవత్సరము మేథమేటిక్స్ క్లబ్‌లో 21 మంది బాలబాలికలు పాల్గొనడం, ఈ కార్యక్రమముపై వారికి గల ఇష్టాన్ని, శ్రద్ధని తెలియజేస్తుంది. మేథమేటిక్స్ క్లబ్‌లో పాల్గొన్న ఏడుగురు విద్యార్థినీవిద్యార్థులతో కలిసి ఓ శిక్షకుడు (శ్రీనివాసరావు అయినాపురపు) పిల్లలకు ఆసక్తిని కలిగించేందుకుగాను జులై 28వ తేదీన ఓ గ్రంధాలయ ప్రాంగణములో 'మేధావధానము' నిర్వహించడము జరిగింది. ఇందులో పాల్గొంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు, స్నేహితులు అందరూ పృచ్ఛకపాత్రను స్వీకరించి వివిధ ప్రశ్నలను బాల అవధానులపై సంధించి గణితముపై వారి ఇష్టాన్ని తెలియజేసారు. ఇచ్చట పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు బాల అవధానులు కాగితము, కలము వాడకుండా 30 సెకనుల కాలపరిధిలో ఘనమూలములు; రెండు వరుస సంఖ్యల వర్గముల భేదము ఇచ్చిన, ఆ సంఖ్యలను తెలుపుట; ఇచ్చిన సంఖ్య (ఐదు అంకెల సంఖ్య వరకు) ను 11చే గుణించగా వచ్చు లబ్దము; ఇచ్చిన సంఖ్యను (పది అంకెల సంఖ్య వరకు) 9 చే భాగించినపుడు వచ్చే శేషము; ఇచ్చిన 3 అంకెల సంఖ్యకు, మరొ మూడు అంకెల సంఖ్యను 11 చే నిశ్శేషముగా భాగించబడునట్లు ఏర్పరచుట వంటి సమస్యలకు సమాధానములు ఇవ్వడం జరిగింది. పిల్లల తల్లిదండ్రులు ఈ ప్రయత్నాన్ని ఎంతగానో కొనియాడారు. కార్యక్రమానికి హాజరైన ప్రేక్షకులు ఈ అవధాన ప్రక్రియను అద్యంతమూ తిలకించడమూ, ప్రశంసించడమూ ఓ గొప్ప అనుభూతి. చాలా మంది చిన్నారులు ఈ కార్యక్రమము తరువాత గణితము నేర్చుకోడానికి రావాలనే తమ ఇష్టాన్ని వారి తల్లిదండ్రులకు తెలపడం, వారు సంఘమిత్ర కార్యవర్గ సభ్యులను సంప్రదించడం మా బాధ్యతను మరింత పెంచుతున్నదని మేము విశ్వసిస్తున్నాము.

మళ్ళీ సంక్రాంతి సంచికలో క్రొత్త శీర్షికలతో కలుద్దాం! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.